గవర్నర్ వద్దకు రిజర్వేషన్ల ముసాయిదా

- ఆమోదం కోసం పంపిన సర్కార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా రాజ్‌భవన్‌కు చేరింది. పంచాయతీరాజ్ చట్టంలో సవరణల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గవర్నర్‌కు పంపించింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్-ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉంది. అందులో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ సవరించాలని నిర్ణయించారు. పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు విధించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. న్యాయశాఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, సిఎం ఆమోదం తర్వాత పంచాయతీరాజ్ శాఖ ఈ ఫైలును ముసాయిదాగా పంపించింది. గవర్నర్ ఆమోదం పొందితే చట్టసవరణ అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్సు చేయనుంది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు గడువు విధించిన విషయం విదితమే.



రమా హాల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి

ఫ్యూచర్ సిటీ తెలంగాణకు గేమ్ చేంజర్

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్

ఫ్యూచర్ సిటీ తెలంగాణకు గేమ్ చేంజర్ అని, మూసి పునర్జీవనం, రీజనల్ రింగ్ రోడ్ పనులు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఊహకు అందనిదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసి)లో రమా హాల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ఇది ప్రజల ప్రభుత్వం. సిఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్, ఉన్నతాధికారులను పారిశ్రామికవేత్తలు ఎప్పుడైనా సంప్రదించవచ్చు. మా ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి," అని భట్టి తెలిపారు. పెండింగ్ పవర్ బిల్లుల వన్-టైమ్ సెటిల్మెంట్‌పై ప్రభుత్వం ఆలోచిస్తోందని, పరిశ్రమలు, పౌర సమాజం కలిసి రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంపద చేర్చాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టి కేవలం సాధనమని, ప్రజల గౌరవం, ఆశయాల నెరవేర్పే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఎఫ్‌టిసిసిఐ వందేళ్ల అనుభవంతో హైదరాబాద్‌ను వర్తక నగరం నుంచి ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగేలా చేసిందని కొనియాడారు.

కెసిఆర్ హయాంలో 6,47,479 కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్ హయాంలో రాష్ట్రంలో పేదలకు 6,47,479 కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేసినట్టు మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. 2021 జులైలో ప్రతిపక్ష నేతగా మల్లు భట్టి విక్రమార్క తన నియోజకవర్గంలో రేషన్ కార్డులు పంపిణీ చేశారని గుర్తుచేశారు. గతంలో బిఆర్ఎస్ లో ఉన్న మాజీ ఎంపి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాడు రేషన్ కార్డుల పంపిణీ గురించి పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని గుర్తుచేశారు. తానూ చౌటుప్పల్‌లో అప్పటి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమక్షంలో రేషన్ కార్డులు ప్రజలకు అందజేసినట్టు పేర్కొన్నారు.

23న విద్యా సంస్థల బంద్

- ఫీజు నియంత్రణ చట్టం తేవాలి
- వామపక్ష విద్యార్థి సంఘాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల 23న విద్యా సంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలతోపాటు ప్రభుత్వ విద్యా సంస్థల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరాయి. ఫీజుల నియంత్రణ కోసం చట్టం తేవాలని సూచించాయి. విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలని డిమాండ్ చేశాయి. హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి అనిల్, జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఎఐడిఎస్ఓ నాయకులు నితీశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, అశోక్‌రెడ్డి, పిడిఎస్‌యు నాయకులు హరీశ్, నవీన్, శ్రీను, ఆసిఫ్ తదితరులు విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎంఇఒ, డిఇఒ, డిప్యూటీ ఇఒ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులను కల్పించాలనీ, నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎన్ఇపి-2020ని రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

డిగ్రీలు కాదు... స్కిల్స్ అవసరం

- విద్యార్థులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలం చెల్లిన జ్ఞానాన్ని విడిచిపెట్టి, నిరంతరం నూతన విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగితేనే సక్సెస్ వరిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. 'లెర్న్, అన్ లెర్న్, రీ లెర్న్' అనేది ఇప్పుడు సక్సెస్‌కు ఫార్ములా అని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో గల తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "మన అమెరికా తెలుగు సంఘం(మాట) - టాస్క్ ఫ్రీ ఆన్ లైన్ ఐటీ ట్రైనింగ్" సర్టిఫికేట్ల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. 'ఒకప్పటిలా చేతిలో డిగ్రీ ఉంటే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు. 50 శాతం మంది గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్ లేవని నాస్కామ్ గుర్తించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో కనీస అవగాహన ఉండటం లేదని తేల్చింది' అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'ఆటోమేషన్ వల్ల ఉద్యోగాలు కనుమరుగైపోతాయనే ఆందోళన వద్దు. 2025 నాటికి 8.5 కోట్ల ఉద్యోగాలు రోబోలు, ఏఐ వల్ల పోతే... కొత్తగా 9.7 కోట్లు పుట్టుకొస్తాయని వరల్డ్ ఎకానమిక్ ఫోరం తేల్చింది' అని మంత్రి చెప్పారు. 'చేతిలో డిగ్రీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై పట్టు ఉంటేనే కొత్త ఉద్యోగాలను సాధించలేరు. క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టీం వర్క్, అడాప్టబిలిటీ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ లాంటి స్కిల్స్ కూడా అవసరం. ఆ దిశగా విద్యార్థి దశ నుంచే కృషి చేయాలి' అని విద్యార్థులకు సూచించారు. లక్ష్యం అంటూ లేని జీవితం చిరునామా లేని లెటర్ లాంటిదని అన్నారు. విద్యార్థి దశలోనే ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. ఆ దిశగా నిరంతరం పరిశ్రమించాలని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్ వర్క్‌తో కూడిన హార్డ్‌వర్క్ చేస్తేనే సక్సెస్ వస్తుందని అభిప్రాయపడ్డారు. 'సాంప్రదాయబద్ధంగా కాకుండా వినూత్నంగా ఆలోచించండి. కొత్త ఆలోచనలకు మేం ఎల్లప్పుడూ అండగా ఉంటాం. స్కిల్ కేపిటల్ ఆఫ్ గ్లోబ్‌గా తెలంగాణను మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. నైపుణ్యాభివృద్ధి కోసం మా ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, టాస్క్ వంటి వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించండి' అని విద్యార్థులకు సూచించారు. ఈ. కార్యక్రమంలో టాస్క్ సిఇఒ శ్రీకాంత్‌సిన్హా, సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాట ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, విజయ్ భాస్కర్, నగేష్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

డేటా సిటీగా హైదరాబాద్

- 1 ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రాణాలను రక్షించే ప్లాస్మా చికిత్సల అభివృద్ధికి ఐకార్ పునాది : రేవంత్ రెడ్డి
- ఐకార్ బయోలాజిక్స్ కొత్త యూనిట్‌కు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారడంతో పాటు ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ కొత్త యూనిట్‌కు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఐకార్ బయోలాజిక్స్ సంస్థ ప్రాణాలను మెరుగుపరిచే, రక్షించే ప్లాస్మా-ఉత్పన్న చికిత్సలను తయారు చేయడానికి, అభివృద్ధిపరచడానికి పునాది వేసిందని తెలిపారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్, బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలకు దక్కిందని తెలిపారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే నిర్ణయాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని, నూతన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుందని, వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తుందని స్పష్టంచేశారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.మూడు లక్షల 28 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించగా, అందులో తెలంగాణ నుంచి పది శాతం మేరకు కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీధర్ బాబు ఐకార్ లోగో ఆవిష్కరించగా, మంత్రి వివేక్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అంతకుముందు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.



కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న సిఎం రేవంత్

సిగాచి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఘోర ప్రమాదం..

- పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి : వెంకటేష్
- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ అధ్యక్షతన పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. సిగాచి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఘోర ప్రమాదం జరిగి 53 మంది కార్మికులు మృతిచెందారని, ఇందులో ఇప్పటికీ ఎనిమిది మంది ఆచూకీ దొరకలేదన్నారు.

మృతిచెందిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ.50 లక్షలు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిగాచి పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి 15 రోజులు దాటినా నేటికీ పరిశ్రమ యాజమాన్యాన్ని ఎందుకు అరెస్టు చేయలేదని, యాజమాన్యంతో ప్రభుత్వానికి ఏమైనా లాలూచి ఉందా అని ప్రశ్నించారు. పరిశ్రమలో ప్రమాదాలకు యాజమాన్యాలదే బాధ్యత వహించాలని, సిగాచి పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు.

యాజమాన్యాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలమైన విధానాలు తేవడంతో ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను తనిఖీలు చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు.. యాజమాన్యాలిచ్చే మాముళ్ల మత్తులో మునిగి తేలాడుతున్నారన్నారు.

వీళ్లకు కార్మికుల ప్రాణాలంటే లెక్క లేదన్నారు.. కార్మిక భద్రత పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిగాచి పరిశ్రమ జరిగిన దుర్ఘటన చూసైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని, లేని పక్షంలో కార్మికుల పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రమాదానికి కారణమైన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సురేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మణికొండలోని ముప్కిన్ చెరువును పరిశీలించిన హైడ్రా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముప్కిన్ చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. మై హోమ్ అవతార్, హాల్ మార్క్ విసినియా నివాసితుల విజ్ఞప్తి మేరకు స్థానిక మున్సిపాలిటీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యను క్షుణ్ణంగా పరిశీలించారు. ముప్కిన్ చెరువులోకి వస్తున్న మురుగునీరు, ఎఫ్‌టిఎల్ మట్టి నింపిన విషయం, ధ్రువంశు సంస్థ చేపడుతున్న చర్యలను స్థానికులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి, నాలా సర్వే, చెరువు ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహిస్తామన్నారు. మురుగునీటిని డైవర్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశీలించిన వారిలో.. స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ విభాగం డిఇలు శివసాయి, సంజయ్, స్థానికులు ఉన్నారు.



ముప్కిన్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

విదేశీయుల పేరుతో ప్రజలపై దాడులు

- దేశాన్ని ప్రమాదంలోకి నెడుతున్న బిజెపి ప్రభుత్వం
- గురుకులాల్లో సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని ప్రమాదంలోకి నెడుతున్నదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో భయానకమైన పరిస్థితులను కల్పిస్తున్నదని అన్నారు. విదేశీయులనే పేరుతో ఎవరిని వేధించదలచుకుంటే వారిపై దాడులు చేస్తున్నదని, ఇప్పటికే ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి చోట్ల ఈ దాడులు మొదలైనవని, ఇది దేశమంతా విస్తరించే ప్రమాదం ఉందని తెలిపారు. సుమారు 40, 50 ఏళ్ల నుంచి ఆయా రాష్ట్రాల్లో నివసిస్తున్నప్పటికీ తమ ఐడెంటిటీని నిరూపించుకోవాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నదని, లేకుంటే వారు దేశభక్తులే కాదని వారిపై కేసు పెట్టేందుకు సైతం వెనుకాడటం లేదని అన్నారు. రుజువు చేసుకోవడానికి ఏ ఆధారాలు కావాలో కూడా కేంద్ర ప్రభుత్వం చెప్తుందని, జనన ధ్రువీకరణ పత్రంతోపాటు తలిదండ్రుల ధ్రువీకరణ పత్రాలు సైతం ఉండాలని చెబుతున్నారని, ఇది చాలా ప్రమాదకరమైన చర్య అని తెలిపారు. బీహార్‌లో ఓటర్ల లిస్టును అప్డేట్ చేస్తున్నామన్న పేరుతో పెడుతున్న నిబంధనలు ప్రమాదకరమైనవిగా ఉన్నాయని అన్నారు. 2003లో ఓటర్ల లిస్టులో పేరున్న వారిని ఒదిలేసి కొత్తగా చేరిన వారిని వారి భారతీయతను నిరూపించుకోవాలని అనడం ఎంతవరకు సబబని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులకు యూరియా కొరత తీవ్రంగా ఉందని, పంట సీజన్ ప్రారంభంలోనే స్టాక్ పెట్టాల్సింది పోయి ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా లేదని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ పాలనలో గురుకుల పాఠశాలల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని అన్నారు. ఇప్పటికే అనేక మంది పిల్లలు ఫుడ్ పాయిజన్ పేరుతో అస్వస్థతకు గురవుతున్నారని, అన్నీ సక్రమంగా నిర్వర్తిస్తున్నామని చెప్తున్న అధికారులు ఎందుకు ఫుడ్ పాయిజన్ జరుగుతుందో ఆలోచించడం లేదన్నారు. ఇది ప్రభుత్వ బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పిల్లల ఆరోగ్యాలను కాపాడాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.ముత్యంరావు, వేల్పుల కుమారస్వామి, ఎ.మహేశ్వరి, ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు మెండే శ్రీనివాస్, మేదరి సారయ్య నాయకులు ఆరెపల్లి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- గురుకులాల కార్యదర్శులకు ఎస్ఎఫ్ఐ వినతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గురుకులాల సమస్యలను పరిష్కరించి విద్యార్థుల సంక్షేమానికి నిధులివ్వాలని ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సాంఘీక సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ సక్రునాయక్, మహాత్మా జ్యోతిభాపూలే గురుకులాల డిప్యూటీ సెక్రటరీ చక్రవర్తి, గిరిజన ట్రైబల్ గురుకులాల కార్యదర్శి సీతా లక్ష్మీకి ఎస్ఎఫ్ఐ బృందం వినతి పత్రాలు సమర్పించింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలనీ, గురుకులాల విద్యా సంస్థల సమయంలో శాస్త్రీయంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుండి అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదనీ, మరుగుదొడ్లు చాలినన్ని లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటిని ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదని గుర్తు చేశారు. అధికారులు నిధులు లేవనే పేరుతో నాణ్యమైన భోజనం కూడా అందించేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అశాస్త్రీయమైన సమయపాలన వల్ల విద్యార్థులు ఉదయం 8 గంటలకే తయారు కావడం, కాలకృత్యాలు తీర్చుకుని, విద్యా సంస్థలకు హాజరు కావడం కష్టమవుతోందని తెలిపారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో 700పైగా విద్యార్థులు ఉంటున్నారనీ, వాటిల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయచి పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు క్వార్టర్లు ఒక చోట, విద్యా సంస్థలు మరోచోట ఉన్నాయని తెలిపారు. దీంతో టీచర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గురుకులాల సమయపాలనలో శాస్త్రీయ పద్ధతిలో మార్పులు చేయాలని కోరారు. అధికారులు స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్, లెనిన్ గువేరా, జిల్లా నాయకులు కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

నారు మళ్లకు ట్యాంకర్‌తో నీరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకు నిదర్శనం ఈ చిత్రమే. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం భవానీపేట్ గ్రామానికి చెందిన రైతు సాయిలు నాటువేసేందుకు వరి నారు పోశారు. అయితే ఓ వైపు వర్షాలు సమృద్ధిగా కురవకపోవడం.. మరోవైపు ఎండ తీవ్రత పెరగడంతో నారును కాపాడుకునేందుకు నీటి ట్యాంకర్ సాయంతో వరి నారుకు నీటిని అందించాడు.

పాలిసెట్‌లో 18,984 మందికి సీట్ల కేటాయింపు

- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఎట్టకేలకు సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక విడుదల చేశారు. పాలిసెట్‌లో 80,949 మంది అర్హత సాధించారని వివరించారు. వారిలో 20,811 మంది అభ్యర్థుల పాలిసెట్ కౌన్సెలింగ్‌కు హాజరై వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. 115 పాలిటెక్నిక్ కాలేజీల్లో 28,996 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 18,984 (65.5 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 10,012 (34.5 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. ఇందులో 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ టెక్నిక్ కాలేజీల్లో 13,964 సీట్లున్నాయని పేర్కొన్నారు. 11,455 (82 శాతం) సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఇంకా 2,509 (18 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 56 ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 15,032 సీట్లుంటే, 7,529 (50.1 శాతం) సీట్లు భర్తీ చేశామని వివరించారు. ఇంకా 7,503 (49.9 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. ఐదు ప్రభుత్వ, ఒక ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీలు కలిపి మొత్తం ఆరు పాలిటెక్నిక్ కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 713 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ప్రత్యేక కేటగిరీ (ఎన్‌సీసీ, స్పోర్ట్స్)కి సంబంధించిన సీట్లను తుదివిడత కౌన్సెలింగ్‌లో కేటాయిస్తామని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజును చెల్లించాలని కోరారు. వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు ఈనెల 18 వరకు గడువుందని తెలిపారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, నవోదయ, ప్రభుత్వ సంక్షేమ గురుకులాలల్లో చదివిన అభ్యర్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. వారు దగ్గరలోని హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. తుదివిడత కౌన్సెలింగ్ తర్వాత అభ్యర్థులు ఈనెల 28 నుంచి 30 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఈనెల 28 నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని వివరించారు. 28 నుంచి 30 వరకు విద్యార్థులకు ఓరియెంటేషన్ తరగతులుంటాయని తెలిపారు. 31 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో కేంద్రీకృత ఇంటర్నల్ స్లైడింగ్‌కు అవకాశముందని తెలిపారు. ఆ కాలేజీలో బ్రాంచీని మార్చుకోవడానికి వీలుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నిథమ్ డైరెక్టర్ వెంకటరమణకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ వెంకటరమణకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. నిథమ్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన నేపథ్యంలో వెంకటరమణ మంగళవారం మంత్రి జూపల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

నథింగ్ ఫోన్ (3) అమ్మకాలు ప్రారంభం

హైదరాబాద్ : బ్రిటన్‌కు చెందిన టెక్ దిగ్గజం నథింగ్ తన నథింగ్ ఫోన్ (3) నథింగ్ హెడ్‌ఫోన్ (1)లను భారత్‌లో జులై 15 నుంచి విక్రయించనున్నట్లు వెల్లడించింది. ఫ్లిప్‌కార్ట్, విజయ్ సేల్స్, క్రోమా, ఇతర ప్రముఖ రిటైల్ స్టోర్‌లలో ఇవి అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఫోన్ ధరలను రూ.62,999గా, హెడ్‌ఫోన్ ధరలు రూ.19,999గా ప్రారంభమవుతాయని.. ప్రారంభ విక్రయాల్లో భాగంగా.. పలు ఆఫర్లను అందిస్తున్నట్లు పేర్కొంది.

ఎంబిబిఎస్, బిడిఎస్ కన్వీనర్ కోటాకు కౌన్సిలింగ్

- కాళోజీ విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఎంబిబిఎస్, బిడిఎస్ కన్వీనర్ కోటా కౌన్సిలింగ్‌కు సంబంధించి కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కన్వీనర్ కోటా కౌన్సిలింగ్‌లో పాల్గొనదల్చుకున్న విద్యార్థులు, ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకూ వర్సిటీ వెబ్‌సైట్‌లో (https://tsmedadm.tsche.in) తమ వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది.
రిజిస్ట్రేషన్ సమయంలో కులం, స్థానికతకు సంబంధించిన సర్టిఫికెట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం రాష్ట్ర విద్యార్థుల జాబితాతో మెరిట్ లిస్ట్ విడుదల చేసి, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 85 శాతం సీట్లను, ప్రయివేటు మెడికల్ కాలేజీల్లోని సగం (50 శాతం) సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు.

పేదల జోలికి వస్తే ఊరుకోం

- గూండాలు, రౌడీలకు బెదిరేది లేదు
- సిఎం రేవంత్‌రెడ్డి రావాల్సిందే..
- కోటి మందిని కోటీశ్వరులను కాదు.. ఉండేందుకు గూడు ఇవ్వండి చాలు
- మల్లు లక్ష్మి


బాధితులతో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని.. గుండాలు, రౌడీలకు బెదిరేది లేదని.. మహిళలంతా శివంగులై తిరగబడితే.. వారిని దాటి అడుగు కూడా ముందుకు వేయలేరని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి హెచ్చరించారు. పేదల గూడు చెదిరితే ఎక్కడికి వెళ్లేదని.. వారు ఉన్న ప్రాంతంలోనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి డివిజన్‌లోని బసవతారకనగర్‌లో గుడిసెలు కోల్పోయిన పేదల పోరాటానికి ఐద్వా మద్దతు తెలిపింది. సిపిఎం, సిపిఐ, ఎంసిపిఐ, ఐద్వా నాయకులు పరామర్శించారు. గుడిసెవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు కూలిన గుడిసెలను చూపిస్తూ నాయకుల ముందు తమ గోడును వెల్లబోసుకున్నారు. 40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నామని.. ఇప్పుడు గుండాలు వచ్చి తమపై దాడికి పాల్పడి, గుడిసెలను కూల్చివేశారని తెలిపారు. పేదలకు ఆయా వామపక్ష పార్టీల నాయకులు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ఇక్కడ జీవిస్తున్న పేదలను ఇక్కడి నుంచి వెళ్లగొట్టి ఆ భూములను ప్రయివేటు వ్యక్తులకు ధారదత్తం చేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలన్నారు.
బెదిరింపు రాజకీయాలతో పేద ప్రజలను ఏమీ చేసినా అడిగే వారు లేరని దౌర్జన్యాలకు పాల్పడితే.. ఎర్రజెండా చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెల పోరాటాలు కొనసాగుతున్నాయని, పలు ప్రాంతాల్లో కూడా దాడులు చేయడం, కేసులు పెట్టినట్టు తెలిపారు. కానీ అక్కడి ప్రజలు ఐక్యంగా పోరాడితే పెద్దపల్లిలో 150 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు.
సాయుధ పోరాటం నుంచి నేటి వరకు అనేక పోరాటాల్లో మహిళలు ముందుభాగాన ఉండి పోరాడినట్టు గుర్తు చేస్తూ.. ఇళ్ల స్థలాల కోసం కూడా అదే స్ఫూర్తితో ఇక్కడి మహిళలు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి.. ఈ భూము లకు పట్టాలు ఇస్తామని, ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇటీవల సిఎం అనేక సభల్లో మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెబుతున్నారని, మహిళలను కోటీశ్వరులను చేయడం ఏమో గానీ ఉండేందుకు ఇళ్లు కట్టిస్తే చాలని అన్నారు. ఇంటి నెంబర్, రేషన్, ఆధార్ కార్డులు జారీ చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఈ ప్రాంతం నుంచి పేదలను తరలించే ప్రయత్నాలు చేయడం సబబు కాదన్నారు. పేదలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సుమ లత, ఉపాధ్యక్షులు అరుణ, ఉమ, సిపిఎం నాయకులు కృష్ణ, శ్రీనివాస్, జంగయ్య, సిపిఐ, ఎంసిపిఐ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆవాజ్ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎండి జబ్బార్, మహమ్మద్ అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఆవాజ్ రాష్ట్ర 3వ మహాసభలో రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు 39 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు జరిగిన ఆవాజ్ రాష్ట్ర మహాసభ ముగిసింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని తేరు మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. సోమవారం పారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆవాజ్ రాష్ట్ర ప్రతినిధుల సభ నిర్వహించారు. అనంతరం 39 మందిని నూతన కమిటీని ఎన్నుకున్నారు.
రాష్ట్ర అధ్యక్షులుగా ఎండీ జబ్బార్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అబ్బాస్, కోశాధికారిగా షేక్ అబ్దుల్ సత్తార్, ఉపాధ్యక్షులుగా అతిఖుర్ రెహామాన్, అజీజ్ అహమ్మద్ ఖాన్, సయ్యద్ హాషం, అబ్దుల్ నబీ, సహాయ కార్యదర్శులుగా ఎంఎ జబ్బార్, ఎంఎ ఇక్బాల్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఖలీం, నశీర్ అహ్మద్, మహబూబ్ అలీ (హైదరాబాద్ సౌత్), అయ్యూబ్ ఖాన్, మహమ్మద్ అలీ, రఫత్ అంజుమ్ (హైదరాబాద్ సెంట్రల్), మహమ్మద్ గౌస్, ఫయ్యాజ్ అహ్మద్ (మేడ్చల్), లతీఫ్ అహమ్మద్, షేక్ ఇమామ్ పాషా, పాషా (యాదాద్రి భువనగిరి), సలీమ్ సర్కారు (సోషల్ మీడియా స్టేట్ ఇన్‌చార్జి), మహబూబ్ అలీ, కో-ఆప్షన్ (నల్లగొండ), ఎండీ జహంగీర్ (సూర్యాపేట), బాబు, సత్తార్ (ఖమ్మం), అక్మల్ పాషా, రహీం ఖాన్ (వరంగల్), గఫ్ఫార్ (ములుగు), అజహరుద్దీన్ (జనగామ), రజియా సుల్తానా (జగిత్యాల), సౌకత్ (మెదక్), హబీబ్ (వికారాబాద్), మహమ్మద్ సలీం (మహబూబ్ నగర్), సలీం (నాగర్ కర్నూల్), ఖాజా (వనపర్తి), రహమతుల్లా (గద్వాల), మౌలాలి (నారాయణపేట) ఎంపికయ్యారు.

సిఎం ప్రజావాణిలో సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సిఎం ప్రజావాణిలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సిఎం ప్రజావాణిలో 296 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవ రాజన్ స్వీకరించారు. వారితో ప్రజలు సమస్యలు చెప్పుకున్నారు. వారు ఆ సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. 296 దరఖాస్తుల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60, రెవెన్యూ శాఖకు సంబంధించి 63, విద్యుత్ శాఖ 22, పౌర సరఫరాల శాఖ ఏడు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 57,. ఇతర శాఖలకు సంబంధించి 144 ఉన్నట్టు అధికారులు తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దరఖాస్తు గడువు 17

- పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
దేశంలోనే ప్రతిష్టాత్మకమైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువు ఈ నెల 17 వరకు ఉందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ బోధన, విద్యార్థులకు సేవలకు కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఈ అవార్డును ప్రదానం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, హెడ్మాస్టర్లు అవార్డుకు అర్హత ఉన్న మంచి ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. మండలస్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. అర్హత ఉన్న ఉపాధ్యాయుల్లో ప్రేరణ కల్పించాలని సూచించారు. ఎక్సలెన్స్, ఇన్నోవేషన్, ఉపాధ్యాయుల అంకితభావం ఆధారంగా ఉత్తమ టీచర్లను ఎంపిక చేస్తామని వివరించారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు https://nationalaward-stoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 17 వరకు దరఖాస్తు చేయాలని తెలిపారు. సంబంధిత డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారికి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ ఐదున అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే.

జెఎస్‌డబ్ల్యు నుంచి సిహెచ్‌డి వాటర్‌గార్డ్ సిమెంట్

హైదరాబాద్ : జెఎస్‌డబ్ల్యు సిమెంట్ భారతదేశంలో తొలిసారిగా టర్ఫో జెల్ టెక్నాలజీతో కూడిన సిహెచ్‌డి వాటర్‌గార్డ్ సిమెంట్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ సూపర్ ప్రీమియం, వాటర్ రిపెలెంట్ సిమెంట్ దక్షిణాదిలోని అధిక తేమ, ఉప్పు, భారీ వర్షాల సవాళ్లను ఎదుర్కొనేలా రూపొందించబడిందని ఆ కంపెనీ పేర్కొంది. ఇది సీపేజీ, తుప్పు, తేమ నష్టాన్ని నిరోధిస్తుందని, నిర్మాణ దృఢత్వం, మన్నికను పెంచుతుందని ఆ కంపెనీ సిఇఒ నీలేస్ నర్వేకర్ పేర్కొన్నారు.

అమెజాన్‌లో అమ్మకానికి ఒబెన్ రోర్ ఇజడ్

హైదరాబాద్ : దేశీయ విద్యుత్ మోటార్ సైకిల్ తయారీ సంస్థ ఓబెన్ ఎలక్ట్రిక్ తన రోర్ ఇజడ్ మోడల్‌ను అమెజాన్ ఇండియాలో అమ్మకానికి ఉంచినట్లు తెలిపింది. డిజిటల్ అమ్మకాల విస్తరణలో భాగంగా జులై 15 నుంచి దీన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు ఓబెన్ ఎలక్ట్రిక్ ఫౌండర్ మధుమిత అగ్రవాల్ తెలిపారు. 3.4కిలోవాట్ బ్యాటరీ రోర్ ధరను రూ.1,19,999గా, 4.4 కిలోవాట్ రోర్ ధరను రూ.1,29,000గా నిర్ణయించామన్నారు. అసలు ధరపై రూ.20వేల తగ్గింపును ఇస్తున్నామన్నారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన నిమ్మ వెంకటేశ్వర్లు, వసుంధర దంపతుల కుమార్తె తనూజ మహాలక్ష్మి (14) మూడేళ్ల కింద కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 7వ తరగతిలో అడ్మిషన్ పొందింది. ప్రస్తుతం 10వ తరగతి చదువుతోంది. వ్యక్తిగత కారణాలతో ఈ నెల నాలుగున ఇంటికి వెళ్లి ఏడున తిరిగి పాఠశాలకు వచ్చింది. గత ఆదివారం మహాలక్ష్మిని కలిసేందుకు తల్లి వసుంధర రాగా సోమవారం తండ్రి కూడా వచ్చివెళ్లారు. రాత్రివరకు తోటి విద్యార్థినులతో కలిసి చదువుకున్న విద్యార్థిని తరగతి గదిలోని ఫ్యాన్‌కి చున్నీతో ఉరేసుకుని చనిపోవడంతో తోటి విద్యార్థులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాఠశాలను సూర్యాపేట డిఇఒ అశోక్, నడిగూడెం ఎంఇఒ ఉపేందర్‌రావు సందర్శించి విద్యార్థిని మృతికి గల కారణాలను ఆరా తీశారు. విద్యార్థిని మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పాఠశాల టీచర్ల ఒత్తిడి వల్లే విద్యార్థిని చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిపిఐ రాష్ట్ర నాయకునిపై కాల్పులు

- చందునాయక్ అక్కడికక్కడే మృతి
- కళ్లలో కారం చల్లి ఆరు రౌండ్లు తుపాకులతో కాల్చిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
హైదరాబాద్ నగర నడిబొడ్డులో కాల్పులు కలకలం రేపాయి. మలక్‌పేట్ శాలివాహన నగర్ పార్కులో ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సిపిఐ రాష్ట్ర నాయకులు చందు నాయక్ (43)పై అందరూ చూస్తుండగానే సినిమా తరహాలో దుండగులు తుపాకులతో కాల్చి దారుణంగా హత్య చేశారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే కారులో వచ్చిన దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో చందునాయక్ అక్కడికక్కడే మృతిచెందారు. దాంతో పార్కులో ఉన్నవారు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందిన సిపిఐ రాష్ట్ర నాయకులు కేతావత్ చందు నాయక్ రాథోడ్ చైతన్యపురిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం తన భార్య, కుమార్తెతో కలిసి మలక్‌పేట్‌లోని శాలివాహన పార్కులో వాకింగ్‌కు వచ్చారు. వాకింగ్ చేస్తున్న సమయంలో ఉదయం 7.20 గంటల సమయంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వచ్చి ముందుగా చందు నాయక్ కండ్లలో కారం చల్లారు. ఆయన తెరుకునేలోపే తుపాకులతో ఆరు రౌండ్లు కాల్పులకు తెగబడ్డారు. దాంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. కాల్పులతో పార్కులో ఉన్న వాళ్ళందరూ భయాందోళనతో ఉరుకులు పరుగులు తీశారు. పాత కక్షలు నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచే చందునాయక్ ఇంటిదగ్గర కొందరు అనుమానాస్పదంగా సంచరించినట్టు సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గుర్తించారు. మృతుని భార్య, కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లిన తర్వాతే చందు నాయక్‌పై దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. 2022లో ఎల్బీనగర్ పరిధిలో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకులు హత్య కేసులో చందునాయక్ నిందితునిగా ఉన్నారు. కాగా, చందు నాయక్ ఎక్కడికి వెళ్లినా భార్య పిల్లలు వెంట ఉంటారని స్థానికులు, బంధువులు తెలిపారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ పిడమర్తి నరేష్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డిసిపి చైతన్యకుమార్, ఎసిపి సుబ్బరామిరెడ్డి పరిశీలించారు. చందు నాయక్ మరణ వార్త విని ఆయన అభిమానులు, బంధువులు, స్నేహితులు ఆయన స్వగృహానికి భారీగా తరలివచ్చారు. సంఘటనా స్థలాన్ని తనిఖీ చేసిన క్లూస్ టీమ్స్ కీలక ఆధారాలను సేకరించాయి. ఇదిలావుండగా కాల్పులకు తెగబడ్డ నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్టు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాం: డిసిపి

కాల్పులకు తెగబడ్డ నిందితులను పట్టుకేనేందుకు ప్రత్యేకంగా 10 బృందాలను రంగంలోకి దించినట్టు సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి చైతన్యకుమార్ తెలిపారు. ఉదయం 7:30కు ఓ వ్యక్తిపై కాల్పులు జరిగాయని సమాచారం వచ్చిందన్నారు. చందునాయక్ ఉదయం వాకింగ్ చేస్తుండగా స్విఫ్ట్ కారులో వచ్చిన నలుగురు దుండగులు కాల్పులు జరిపారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తుచేస్తున్నామన్నారు. సంఘటనా స్థలంలో ఐదు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. లభించిన బుల్లెట్లను పరిశీలిస్తే వెపన్‌తో ఫైరింగ్ చేసినట్టుందన్నారు. సంఘటనా స్థలంలోని అన్ని సీసీ కెమెరాల పుటేజీలను సేకరించామన్నారు. నిందితులు ఉపయోగించిన కారును గుర్తించామని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని డిసిపి తెలిపారు.

ప్రాథమిక సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్పు

- సహకార రంగంలో సమూల మార్పులు, నూతన వరవడికి శ్రీకారం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
దేశంలోనే ఎక్కడాలేని విధంగా ప్రాథమిక సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సహకార రంగంలో సమూల మార్పులు చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఎన్‌సిడిఎస్, కో ఆపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో 311 ఎఫ్‌పీఓలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సహకారం పరపతి సంఘాలు తమ దృక్పథం మార్చుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఉండి సహకార రంగంలో దేశవ్యాప్తంగా రోల్ మోడల్‌గా నిలిచిన ముల్కనూరు సహకార పరపతి సంఘ విజయాల్ని ప్రస్తావించారు. సహకార సంఘ బాధ్యతలు నీతిగా, నిజాయితీగా చేస్తూ.. సంఘ అభివృద్ధికి పాటుపాడితే ముల్కనూరు లాంటి సహకార సంస్థలు మరిన్ని ఉద్భవించే అవకాశాలు ఉంటాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 10,000 రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్న క్రమంలో ఇప్పటికే ఉన్న ప్రాథమిక సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలు'గా మార్చి, వారికి మరింత ఆర్థిక తోడ్పాటు అందించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో, నిర్లిప్తంగా ఉన్న తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్‌ను క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్‌గా నియమించి దాని ద్వారా రాష్ట్రంలో 311 సహకార పరపతి సంఘాలను ఎఫ్‌పీఓలుగా ఎన్నిక చేశామన్నారు. వీటికి ఒక్కొక్క దానికి రూ.15 లక్షల ఈక్విటీ గ్రాంటు, రూ.18 లక్షల మేనేజ్‌మెంట్ ఖర్చు అనగా 311 ఎఫ్‌పీఓలకు సుమారు రూ.167.93 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. మొదటి విడతగా రూ.9,85,40,000 విడుదల చేశామని వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రెడిట్ గ్యారంటీ స్కీమ్‌లో భాగంగా ప్రతి ఎఫ్‌పీఓ లకు 2 కోట్లు వరకు లోన్ గ్యారంటీ సౌకర్యం కూడా ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో కూరగాయలు, పండ్ల సాగును ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిదీ అని, ఆదేవిధంగా వ్యవసాయంలో ఎరువుల, రసాయనాల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయం దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిడిఎస్ రీజనల్ డైరెక్టర్ శార్దూల్, తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మెన్ మోహన్‌రెడ్డి, రవీందర్‌రావు, ఛైర్మన్లు, కోఆపరేటివ్ సిబ్బంది, రాష్ట్రం నలుమూలాల నుంచి 311 సొసైటీ ఛైర్మెన్లు పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టులు లొంగుబాటు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రెండు దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన ఇద్దరు రాష్ట్ర కమిటీ సభ్యులు రామ గుండం పోలీసు కమిషనర్ ఎదుట లొంగిపోయారు. సిపి అంబటి కిషోర్ సమక్షంలో ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న, చౌదరి అంకుబాయ్ అలియాస్ అనితక్క (లక్ష్మి) మంగళవారం లొంగిపోయారు. లొంగిపోయిన వారిని సిపి సన్మానించి, వారికి రూ.25 లక్షల రివార్డు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిపి వివరాలను వెల్లడించారు. లచ్చన్న 1993లో సిపిఐ (ఎంఎల్)లో దళ సభ్యునిగా చేరి చెన్నూరు దళంలో పనిచేశాడు. 2002లో సిర్పూర్ దళానికి డిప్యూటీ కమాండర్‌గా పదోన్నతి పొందాడు. లచ్చన్నపై తెలంగాణలో 35 కేసులున్నాయి. 1989లో లచ్చన్న, చౌదరి అంకుబాయిని వివాహం చేసుకున్నాడు. అంకుబాయ్‌పై కూడా కొమురం భీమ్, ఆసిఫాబాద్ జిల్లాల్లో 14 కేసులు ఉన్నాయి. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు తమ ఊర్లకు తిరిగి వచ్చి ప్రశాంత జీవితాన్ని గడపాలని సిపి అంబటి కిషోర్ కోరారు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులకు పోలీసులు అన్ని విధాలా సహకారం అందిస్తారని, తెలంగాణ ప్రభుత్వం కల్పించే పునరావాస పథకాల ద్వారా వారికి అవసరమైన సౌకర్యాలు అందిస్తామని తెలిపారు. అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు కూడా లొంగి గ్రామాలకు తిరిగి రావాలని సూచించారు. కొంతమంది వ్యక్తులు ప్రజా సంఘాల పేరుతో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సిపి హెచ్చరించారు. కాగా, కాలం చెల్లిన సిద్ధాంతాలతో మావోయిస్టులు హింసను ప్రేరేపిస్తున్నారని, ఇవి ఇప్పుడు పని చేయడం లేదని లచ్చన్న తెలిపారు.

ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి విద్యార్థినికి గాయాలు

- కేటిదొడ్డి కెజిబివి కాలేజీలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుంచి కిందపడి తీవ్ర గాయలైన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి కెజిబివి కళాశాల వద్ద మంగళవారం జరిగింది. కెజిబివి ఎస్ఓ పద్మావతి తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ మండలం భూత్పూర్ గ్రామానికి చెందిన చెన్నయ్య గౌడ్ కూతురు సాయిశృతి ఇంటర్ ఫస్టియర్ బైపిసి చదువుతోంది. మంగళవారం ఉదయం విద్యార్థిని కళాశాల మొదటి అంతస్తు మీద నుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. తీవ్ర గాయాలైన విద్యార్థినిని కళాశాల సిబ్బంది గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన ఆర్థోపెటిక్ డాక్టర్ నాగేశ్వరరావు ప్రాథమిక చికిత్స అందించి.. వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం విద్యార్థిని సాయిశృతిని హైదరాబాద్ తరలించారు. కాగా, ఎంఇఓ వెంకటేశ్వర రావు, విద్యాశాఖ కో ఆర్డినేటర్ హంపయ్య, కేటిదొడ్డి ఎస్ఐ శ్రీనివాసులు గద్వాల్ జిల్లా ఆస్పత్రిలో విద్యార్థినిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరాతీశారు.

నృత్య గురువులందరికీ జీవనోపాధి కల్పించాలి

- కోవిద ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ పి అనూహ్య రెడ్డి
- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో సమస్యలపై సభ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నృత్య గురువులందరినీ గుర్తించి, సమాన అవకాశాలు, జీవనోపాధి కల్పించాలని కోవిద ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ అధ్యక్షులు డా.॥పి. అనూహ్య రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం టిపిఎస్‌కె హాల్‌లో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్‌కె), కోవిద ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా నృత్య గురువుల సమస్యలపై సమాలోచన సభను గోవిందా ఆర్ట్స్ కల్చరల్ అండ్ అకాడమీ సలహాదారులు పిఎన్ మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అనూహ్య రెడ్డి మాట్లాడుతూ.. నృత్య గురువులకు భారతదేశంలో విశేషమైన స్థానం ఉందన్నారు. కానీ వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం, సంక్షేమం అందడం లేదని తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహా కమిటీ సభ్యులుగా నృత్య గురువులనూ చేర్చాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయ సంగీత నృత్య అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు.
టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణలో సాంస్కృతిక సచివాలయం ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాలో ఆడిటోరియంలను పునరుద్ధరించాలని, ప్రతి బడిలో ఒక నృత్య టీచర్ ఉండాలని, కళాకారులకు కల్చరల్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువులకు నిరంతర శిక్షణా శిబిరాలు, వర్క్‌షాప్‌లు, రికార్డింగ్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. సభా అధ్యక్షులు పిఎన్ మూర్తి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్న నృత్య గురువులు ఎంతో మంది ఉన్నారని, వాళ్ళ కండ్లల్లో కనిపించని కన్నీళ్లున్నాయని, సవాలక్ష సమస్యలున్నాయని అన్నారు. కాబట్టి వారి హక్కులు సాధించేందుకు ఐక్యంగా సకల కళల శోభాయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. కళాకారులందరికీ ఆర్థిక ప్రోత్సాహకం అత్యంత అవసరం అని అన్నారు. దేవాలయాలు, పర్యాటకశాఖలు, సాంస్కృతిక కళాక్షేత్రాలు.. అన్నిట్లో నృత్య గురువులకు అవకాశాలు కల్పించాలని తెలిపారు. నృత్య గురువులకు ఆర్థిక గౌరవం, ఉపాధి అవకాశాలు వెంటనే అమలు చేయాలని కళాకారులందరూ ముక్తకంఠంతో నినదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నృత్య గురువులు రమణీ, సిద్ధి ఇందిరా, పరాశరం చిన్న జీయర్ స్వామి, పవన్, డాన్స్ మాస్టర్, తెలుగు వెలుగు శ్రీరామ్ దట్టి, సీనియర్ జర్నలిస్టు సుమన్, సామాజికవేత్త సురేష్ గౌడ్, అనుదీప్తి, హిందుమతి, రాధిక శ్రీనివాసులు, లావణ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పారదర్శకంగా సరుకుల సేకరణ జరగాలి

- షఫీయుల్లా ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్టంలోని సంక్షేమ గురుకులాలతో పాటు అన్ని వసతి గృహాల్లో సరుకుల సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మైనారిటీ గురుకుల కార్యదర్శి షఫీయుల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి అవసరమైన నిత్యావసర సరకుల ప్రొక్యూర్‌మెంట్, ఇతర సరకుల సేకరణపై మార్గదర్శకాల రూపకల్పనకు సంబంధించి ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షఫీయుల్లా మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల సరఫరా, సేకరణ అనేది స్థానికంగా ఉండే ధరలకనుగుణంగా సరసమైన ధరలతో ఉండేలా చూడాలన్నారు, వసతి గృహాలకు సకాలంలో వాటిని సరఫరా చేయాలని సూచించారు. టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలనీ, వీలైనంత త్వరగా ఆ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో టెండర్ ప్రక్రియ ఎలా జరిగిదనే విషయమై ఆయన ఆరా తీశారు. సమావేశంలో ప్రాజెక్ట్ మోనిటరింగ్ యూనిట్ చైర్మెన్ డా విఎస్ అలగు వర్షిణి, బిసి గురుకులాల కార్యదర్శి సైదులు, గిరిజన గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి పాల్గొన్నారు.